క్లుప్తంగా

చిన్నారుల ఆధార్ క్యాంప్



ఆధార్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న రాజశేఖర్

దెందులూరు: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో చిన్నారుల కోసం ఉచిత ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నట్టు స్త్రీ శిశు సంక్షేమ శాఖ పెదపాడు మండల అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి రాజశేఖర్ తెలిపారు. స్థానిక ఎస్ఎంఆర్ నగర్‌లోని గ్రామ సచివాలయంలో ఆధార్ క్యాంప్‌ను ఆయన గురువారం పరిశీలించారు. ఆయన వెంట స్థానిక అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

సొసైటీ ఉద్యోగుల నిరసన



నల్లబాడ్జీలతో విధులకు హాజరైన సొసైటీ ఉద్యోగులు

ఉంగుటూరు: నారాయణపురం సొసైటీ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. సొసైటీ ఉద్యోగులు సంఘం పిలుపు మేరకు గురువారం ఈ నిరసన వ్యక్తం చేసినట్టు ఉద్యోగులు తెలిపారు. వేతన సవరణ చేయాలని, ఉద్యోగ కాలపరిమితి 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు.

టీచర్ కల్యాణికి సత్కారం



టీచర్ కళ్యాణిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

దెందులూరు: జాతీయ స్థాయిలో సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైన టీచర్ కళ్యాణిని స్థానిక గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్ఎం మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు గురువారం సత్కరించారు. ఈనెల 20 నుంచి 25 వరకు పుదుచ్చేరిలో జరిగే సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో కల్యాణి పాల్గొనున్నారు.

వృద్ధులకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేసిన దృశ్యం

ఉంగుటూరు: మండలంలోని ఉప్పాకపాడు పాఠశాల ఉపాధ్యాయుడు అల్లు శ్రీను రచించిన కథకు యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో నిర్వహించిన కథల పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచింది. ఈ మేరకు వచ్చిన మొత్తంతో ఉప్పాకపాడు గ్రామంలో వృద్ధులకు చీరలు, పండ్లు పంపిణీ చేసినట్టు ఉపాధ్యాయులు తెలిపారు. శ్రీను గతంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు వచ్చిన మొత్తంతోపాటు మరికొంత నగదుతో పేదలు, వృద్ధులకు, దుప్పట్లు, టవల్స్, వృద్ధాశ్రమానికి పరుపులు, తలగడలు పంపిణీ చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతారామయ్య కుటుంబానికి పరామర్శ



సీతారామయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న దృశ్యం

దెందులూరు: మండలంలోని గాలాయిగూడెంకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, రైతాంగ సమాఖ్య రాష్ట్ర నాయకుడు ముసునూరి సీతారామయ్య మృతి బాధాకరమని పలువురు పేర్కొన్నారు. గురువారం ఆయన నివాసంలో పెదవేగి మాజీ ఎంపీపీ చల్లా చక్రధర్‌రావు, పలువురు ప్రజా ప్రతినిధులు సీతారామయ్య కుమారులు ముసునూరి వెంకటేశ్వరరావు, సాంబశివరావులను పరామర్శించారు. సీతారామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామాల్లో చెరువులు, సాగునీటి కాలువల అభివృద్ధి, సాగునీటి సమస్య పరిష్కారానికి సీతారామయ్య కృషి చేశారని వారు గుర్తుచేసుకున్నారు.

16 వరకు రెండు విడతలుగా వ్యవసాయ విద్యుత్ సరఫరా

పెదవేగి : భీమడోలు – పెదవేగి ఫీడర్ కండక్టర్ మార్పు నేపథ్యంలో ఈనెల 9 నుంచి 16వ తేదీ వరకు వ్యవసాయానికి రోజు రెండు విడతలగా విద్యుత్ సరఫరా చేస్తామని ఈఈ కేఎం అంబేద్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులంతా సహకరించాలని ఆయన కోరారు.

రబీపైనే రైతుల ఆశలు

- ఉంగుటూరు నియోజకవర్గంలో వరి నాట్లు 44 శాతం పూర్తి
- ఖరీఫ్‌ను ముంచిన విపత్తులు



వరి నారు తీస్తున్న నిడమర్రు రైతులు



చేలో దమ్ము చేస్తున్న ట్రాక్టర్

నిడమర్రు: రైతుల ఆశలపై ఖరీఫ్ నీళ్లు చల్లింది. వరి చిరు పొట్ట దశలో భారీ వర్షాలు కురవడం, గింజ గట్టిపడే సమయంలో కొంతమేర తెగుళ్ల వ్యాప్తి చెందడంతో ధాన్యం దిగుబడి గణనీయంగా తగ్గింది. ఖరీఫ్ నష్టాన్ని మిగల్చడంతో కోటి ఆశలతో రైతులు రబీ సాగు చేపట్టారు. ఉంగుటూరు నియోజకవర్గంలో 44 శాతం వరకు రబీ వరి నాట్లు పూర్తిచేశారు.

70 శాతం వెదజల్లే పద్ధతి

వరి సాగులో వెదజల్లే విధానానికి ఆదరణ లభిస్తోంది. పరిమితంగా సాగు వ్యయం, కూలీల ఖర్చుల తగ్గుతుండటం, నీటి తడులు ఎక్కువగా ఇవ్వాల్సిన అవసరం లేకపోవడంతో ఈ విధానంలో సాగు చేసేందుకు రైతులు మక్కువ చూపుతున్నారు. ఖరీఫ్, రబీ ఇలా సీజన్ ఏదైనా విత్తనాలు వెదల్లే పద్ధతినే అవలంబిస్తున్నారు. కొల్లేరు గ్రామాల్లో వ్యవసాయం వెదజల్లే పద్ధతిలో నాట్లు వేశారు. పెదనిండ్రకొలనులో 80 శాతం, బావాయిపాలెం, చానమిల్లి గ్రామాల్లో 60 శాతంపైగా వెదజల్లే పద్ధతినే రైతులు ఎంచుకున్నట్టు ఏఈఓ ప్రసాద్ తెలిపారు.

ఎరువుల అందుబాటులోకి తేవాలి

ఉంగుటూరు నియోజకవర్గం వ్యాప్తంగా రబీ సీజన్‌లో 48,883 ఎకరాల్లో వరి సాగువుతంది. ఇందుకు సుమారు 3,200 ఎకరాల్లో రైతులు నారుమళ్లు సిద్ధం చేసుకున్నారు. 21,707 ఎకరాల్లో ఇప్పటి వరకు వరి నాట్లు పూర్తిచేశారు. వైఎస్సార్ సీపీ హయాంలో వ్యవసాయ శాఖ ఎరువులను ముందస్తుగా అందుబాటులో ఉంచేది. ప్రస్తుతం అవసరమైన ఎరువులు లేవని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 11 తేదీ నాటికి అందుబాటులో తీసుకొస్తామని చెబుతున్నారు.

అన్నదాత సుఖీభవ అందేనా?

పంటల సాగును ప్రోత్సహించేందుకు వైఎస్సార్ సీపీ హయాంలో రైతు భరోసా కింద ఏటా రూ. 13,500 పెట్టుబడి నిధిగా అందజేసేది. రైతులు అప్పులు చేయకుండా సాగు చేపట్టే వారు. నేడు కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించింది. అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రూ.20 వేలు అందజేస్తామని ప్రకటించి అమలు చేయకుండా రైతులను మోసం చేసింది. ఈ ఏడాదైనా అందజేస్తారా, లేదా అన్న మీమాంసం రైతుల్లో నెలకొంది.

నియోజకవర్గంలో ఇలా...

మండలం	రబీ సాగు లక్ష్యం ఎకరాల్లో	పూర్తయిన నాట్లు ఎకరాల్లో
ఉంగుటూరు	21,173	9,354
నిడమర్రు	5,328	2,425
భీమడోలు	10,669	4,250
గణపవరం	11,713	5,678
మొత్తం	48,883	21,707

అధిక యూరియా అనర్థమే



రైతులు పంట సాగుకు యూరియా ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఇది ప్రమాదకరం. యూరియాతో పాటు కాంప్లెక్స్ ఎరువులు కూడా వినియోగించాలి. అప్పుడే దిగుబడి పెరుగుతుంది. యూరియా మాత్రమే ఎక్కువగా వినియోగించడం వల్ల నేల చవుడు బారుతుంది. సహజత్వం కోల్పోతుంది. భవిష్యత్తులో నేలలో లవణత్వం పెరిగి సారం తగ్గే అవకాశం ఉంది.

– చీర్ల రవికుమార్, ఏఓ, ఏడీ కార్యాలయం, భీమడోలు

రబీ ఆదుకుంటేనే గట్టెక్కుతాం



ఖరీఫ్‌లో ఆరెకరాల మాగాణి కౌలుకు తీసుకుని వరిసాగు చేశాను. తుఫాన్లు, వాతావరణంలో మార్పుల వల్ల ఎకరాకు 10 బస్తాలు వరకు దిగుబడి తగ్గింది. దీంతో మగతా కింద 15 బస్తాలు ఇచ్చాను. మిగిలింది పెట్టుబడులకు పోయింది. ఈ నేపథ్యంలో ఖరీఫ్‌లో నష్టం భర్తీ చేసుకునేందుకు రబీ పంటపైనే ఆశలున్నాయి. రబీ ఆదుకుంటేనే గట్టెక్కుతాను.

– సంకు ఆంజేయులు, కౌలు రైతు, బువ్వనపల్లి

● సంబరాల సంక్రాంతి



గణపవరం డిగ్రీ కాలేజీలో భోగి మంట వద్ద విద్యార్థినుల ప్రదక్షిణ



బువ్వనపల్లి యూపీ స్కూల్లో రంగవల్లులు



వాకపల్లి యూపీ స్కూల్లో హరిదాసు

సంక్రాంతి సంబరాలతో ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం సందడి నెలకొంది. రంగురంగుల రంగవల్లికలు, హరిదాసుల సంకీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు, భోగిమంటలు పాఠశాలలకు నూతన శోభను తీసుకొచ్చాయి. సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు ఆకట్టుకున్నారు. శుక్రవారం గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీతోపాటు పలు ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు.

– గణపవరం

హమాలీల ఒప్పందాన్ని అమలు చేయాలి



పాతూరు గుడౌన్ వద్ద జెండా వందనం చేస్తున్న లింగరాజు

భీమడోలు: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ హమాలీలతో చేసుకున్న ఒప్పందం అమలు చేస్తూ వెంటనే జీఓ తీసుకుని రావాలని ఆ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజు అన్నారు. మండలంలోని పాతూరు సివిల్ సప్లయిస్ హమాలీ కార్మికుల వార్షిక సమావేశం గురువారం కె.రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో లింగరాజు మాట్లాడుతూ ప్రతి రెండేళ్లకు ఒక సారి హమాలీ కూలీల రేట్లు పెంచుతూ ప్రభుత్వం ఒప్పంద కుదుర్చుకుంటుందన్నారు. 2024 జనవరి నాటికి ఒప్పందం ముగిసిందని, సంబంధిత మంత్రి నాదెండ్ల మనోహర్ రేట్లు పెంచుతూ నిర్ణయం తీసుకుని రెండు నెలలు కావస్తున్నా నేటికి జీఓ జారీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎర్రబోలు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా బొద్దుపల్లి అప్పలనాయుడు, కార్యదర్శిగా కోన వెంకటేశ్వరరావు, మేస్త్రిగా కె.త్రినాథ్ సోమేశ్వరరావు తదితరులను ఎన్నుకున్నారు. తొలుత సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. నాయకులు కె.వెంకటేశ్వరరావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ దుకాణాలపై దాడులు



నూనె ప్యాకెట్లను పరిశీలిస్తున్న అధికారులు సీతారాము, రామరాజు

భీమడోలు: భీమడోలు, ద్వారకాతిరుమల మండలాల్లో కంపెనీ పేర్లు మార్చి ఆయిల్స్ విక్రయిస్తున్న రెండు దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం ఆకస్మిక దాడులు చేశారు. నాణ్యత పరీక్షల కోసం ఆయిల్ శాంపిల్స్‌ను సేకరించారు. గుంటూరు జిల్లా నరసారావుపేట కేంద్రంగా ఆయిల్ ప్యాకెట్లు, డబ్బాలు ఈ దుకాణాలకు సరఫరా అవుతున్నట్టు నిర్ధారించారు. విజిలెన్స్ ఎస్పీ వి.రాంబాబు ఆదేశాల మేరకు ఎస్సై కె.సీతారాము, ఆహార తనిఖీ అధికారి కె.రామరాజులు దాడులు నిర్వహించారు. ఎం.నాగులపల్లి పరిధిలోని భీమడోలు జంక్షన్ పక్కనే ఉన్న జై శ్రీ వేంకటేశ్వర స్వామి ట్రేడర్స్‌లో కర్నూలు వేరుశనగ నూనెకు బదులుగా 1,897 లీటర్ల కల్లూర్ వేరుశనగ నూనె, భీమడోలు శ్రీరామచంద్ర ట్రేడర్స్‌లో సూపర్ లైన్ పేరుతో 2,274 లీటర్ల నూనె ఉన్నట్టు గుర్తించారు. వీటి శాంపిల్స్‌ను సేకరించారు. ఆహార నాణ్యత పరీక్షలకు ల్యాబ్ పంపుతామని, నివేదిక వచ్చే వరకు దుకాణాల్లో ఉన్న ఆయిల్స్ విక్రయాలను నిలుపుదల చేశారు.

జూదాలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు



సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై వీరప్రసాద్

నిడమర్రు: సంక్రాంతి పండుగ పేరుతో గ్రామాల్లో కోడి పందేలు, పేకాట వంటి అసాంఘిక కార్యక్రమాలకు తెరతీస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై వీర ప్రసాద్ హెచ్చరించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కోడిపందేలు, పేకాట, గుండాట వంటి ఇతర అసాంఘిక కార్యక్రమాల నిషేధంపై మండల, గ్రామ స్థాయి అధికారులతో అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీటీ బి.దుర్గా ప్రసాద్ మాట్లాడారు.

ఆనందంగా గడపాలి

గణపవరం: సంక్రాంతిని ప్రజలు ఆనందంగా నిర్వహించుకోవాలని తహసీల్దార్ వై.అప్పారావు సూచించారు. కోడిపందేలు, పేకాట వంటివి నిషేధమని జల్లికొమ్మర గ్రామ సచివాలయం వద్ద అవగాహన కల్పించారు. ఎస్సై మణికుమార్, సర్పంచ్ కురెళ్ల వెంకటరత్నం మాట్లాడారు.

ఫ్లెక్సీ ప్రచారం

దెందులూరు: కోడిపందేలు, పేకాట అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించరాదని గ్రామాల్లో వీఆర్ఓలు, కార్యదర్శులు ఫ్లెక్సీల ద్వారా ప్రచారం చేస్తున్నారు. స్థానిక తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీఓ కె.శ్రీదేవి ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో సచివాలయాల వద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

కోర్టు ఉల్లంఘన కేసులు

భీమడోలు: సంక్రాంతి ముసుగులో కోడి పందేలు, జూద క్రీడలకు నిర్వహిస్తే కోర్టు ఉల్లంఘన కేసులు బనాయిస్తామని ఎస్సై వై.సుధాకర్ హెచ్చరించారు. పూళ్ల, భీమడోలు గ్రామ పంచాయతీల వద్ద కోడి పందేలు, జూద క్రీడల నిషేధంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. సర్పంచ్ దాయం సుజాత, ఏఎస్సై చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కఠిన చర్యలు తప్పవు

పెదవేగి : సంక్రాంతికి కోడి పందేలు నిర్వహిస్తే కఠినంగా శిక్షిస్తామని ఎస్సై కె.రామకృష్ణ హెచ్చరించారు. వంగూరులో కోడిపందేల నిర్వహణ, గుండాట, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాల నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించారు. నాయకులు, పోలీస్ సిబ్బంది, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి



అవగాహన కల్పిస్తున్న ఆర్టీఓ కృష్ణారావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కాంట్రాక్ట్ క్యారియర్ బస్సుల యజమానులు ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆర్టీఓ కేఎస్ఎంవీ కృష్ణారావు సూచించారు. సంక్రాంతి రద్దీ నేపథ్యంలో ప్రైవేట్ క్యారియర్ వాహన యజమానులతో గురువారం నగరంలోని ఆయన కార్యాలయంలో అవగాహన కల్పించారు. ప్రయాణికుల రద్దీని ఆసరాగా చేసుకుని టిక్కెట్ల ధరలు అధికంగా వసూలు చేయరాదని హెచ్చరించారు. బస్సుల కిటికీలు, తలుపులు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని, ప్రమాదాల నివారణకు డ్రైవర్లకు సూచనలివ్వాలని అన్నారు.

న్యాయవాదుల అభ్యున్నతికి కృషి



డైరీని ఆవిష్కరించిన న్యాయవాదులు, నాయకులు

ఏలూరు (టూటౌన్): న్యాయవాదుల అభివృద్ధి, అభ్యున్నతి కోసం ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) కృషి చేస్తుందని నాయకులు బండి వెంకటేశ్వరరావు, వాకాడ రాజారావు, పీఎస్ చందు అన్నారు. వారు ఐఏఎల్ ఏలూరు యూనిట్ ఆధ్వర్యంలో స్థానిక స్ఫూర్తి భవనంలో గురువారం ఐఏఎల్ 2025 డైరీని ఆవిష్కరించారు. ఐఏఎల్ న్యాయవాదుల సంక్షేమానికి నిరంతరం పనిచేస్తుందని, న్యాయవాదులకు రక్షణగా నిలిస్తుందని వారు వివరించారు. న్యాయవాదుల వెల్ఫేర్ బోర్డు ద్వారా మరిన్ని సౌకర్యాలు, రాయితీల కోసం వివిధ సంఘాలతో కలిసి కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఐఏఎల్ బలోపేతానికి న్యాయవాదులంతా ఐఏఎల్‌లో సభ్యులుగా చేరాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు పీపీ శాస్త్రి, విశ్రాంతి జడ్జి ఎ.లక్ష్మి, న్యాయవాదులు రాజనాల రామ్మోహనరావు, చిక్కా భీమేశ్వరరావు, పీపీ రత్నం, బలగం బాలాజీ, ఏఐటీయూసీ నాయకులు ఎం కృష్ణ చైతన్య, ఆర్ శ్రీనివాస డాంగే, పుప్పాల కన్నబాబు, ఎ.అప్పలరాజు, బి.శ్రీనివాసరావు ఏఐఎస్ఎఫ్ నాయకులు శివ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థి సంఘం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రెండు రోజుల వ్యాసరచన పోటీలు గురువారం ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. తొలి రోజు స్థానిక ఎస్‌పీడీబీటీ కళాశాలలో ఉదయం 11.30 నుంచి 12.30 గంటల వరకు నిర్వహించిన ఈ పోటీల్లో 23 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలకు అబ్జర్వర్‌గా కళాశాల తెలుగు లెక్చరర్ టి.ప్రేమ్ కుమార్ వ్యవహరించారు. శుక్రవారం స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 11.30 గంటలకు వ్యాసరచన పోటీలు ప్రారంభమవుతాయని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎం యశ్వంత్, ఎస్ సునీల్ కుమార్, వై శాంతి కిరణ్, బి.చందన్, ఎస్ లీలా కుమారి, పి.కీర్తన పాల్గొన్నారు.

ముందస్తుగా వాహనాల పన్ను చెల్లించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు జిల్లాలో వాహనాలకు పన్ను చెల్లించాల్సిన యజమానులు ఈ త్రైమాసిక పన్నును ముందుగానే చెల్లించాలని జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ తెలిపారు. ఈ క్వార్టర్ నుంచి వాహన్ వెబ్సైట్ (నేషనల్ సాఫ్ట్వేర్) ద్వారా పన్నులు చెల్లించే కారణంగా ముందుగానే ఆయా వాహన సంబంధిత మండల మ్యాపింగ్, ఈకేవైసీలు వెబ్ సైట్లో నమోదు చేయించుకోవాలని సూచించారు. ఇతర రాష్ట్రాల్లో వాహన కేసులు బకాయి ఉన్నంటే త్వరితగతిన ఆ రాష్ట్రాల్లోనే అపరాధ రుసుం చెల్లించాలన్నారు. లేకుంటే ఆన్‌లైన్‌లో పన్ను చెల్లించే అవకాశం ఉండదని తెలిపారు. జరిమానా చెల్లించని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

జగన్‌ను కలిసిన నాయకులు

భీమడోలు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం సాయంత్రం ఆ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి, ఎంపీటీసీ ముళ్లగిరి జాన్సన్, భీమడోలు కోప్షన్ సభ్యుడు, నూర్‌బాషా సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ ఆజాంలు మర్యాదపూర్వకంగా కలిశారు. తమను ఆయన ఆప్యాయంగా పలకరించారని, పార్టీ కోసం పని చేయాలని, కార్యకర్తలకు అండగా ఉంటానని తెలియజేశారని నాయకులు వివరించారు. ఆయనను కలవడం ద్వారా తమలో మనోధైర్యం పెరిగిందన్నారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే భక్తుల మృతి

భీమడోలు: తిరుమల తిరుపతిలో తొక్కిసలాటలో భక్తుల ప్రాణాలు పోవడానికి కూటమి ప్రభుత్వమే కారణమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ భీమడోలులో గురువారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. హైందవ శంఖారావంలో సనాతన ధర్మం ప్రసంగించిన పీఠాధిపతులు బయటకు రావాలని, భక్తుల మృతి ఘటనపై ధర్నా చేయాలని కోరారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు సినిమాలపై ఉన్న శ్రద్ధ తిరుమలపై లేదని, పవన్ నిర్వహించే ఫంక్షన్‌కు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని పవనిజం భక్తిని చాటుకుంటున్నారని పేర్కొన్నారు. తిరుపతిలో తొక్కిసలాట ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదపాడు : స్థానిక పాతముప్పర్రు సబ్‌స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ రాంబాబు తెలిపారు. కొత్తూరు, కొత్త ముప్పర్రు, పాతముప్పర్రు, జయపురం, వీరమ్మకుంట వెంకటాపురం పరిసర ప్రాంత గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

మార్మోగిన గోవింద నామస్మరణ



ఇరుముడులు ధరించిన గోవింద మాలధారులు

భీమడోలు: గుండుగొలను శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం గురువారం గోవింద నామస్మరణతో మార్మోగింది. సగర్ల కాలనీకి చెందిన గోవింద భక్తులు ఇరుముళ్ల ధారణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వాములంతా కాలినడకను చినతిరుపతికి వెళ్లారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు వగ్వాల అచ్యుతరామారావు, పూజరులు మంగపతి ఆచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం



మల్కాపురంలో బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న ఉద్యోగులు

ఏలూరు రూరల్ : బాల్య వివాహాలు అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ ఆర్ వినోద్‌కుమార్ కోరారు. గురువారం ఏలూరు రూరల్ మండలం మల్కాపురంలో ఆ సంస్థ సభ్యులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలపై 112, 1098 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని వినోద్‌కుమార్ కోరారు. ప్రతి గ్రామాన్ని బాల్య వివాహ రహిత గ్రామంగా మార్చేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

పరమట పుష్ప రాజ్ పాల్ S/o. జోసెఫ్ రాబర్ట్, ఏపూరు, పెదపాడు మండలం, ఏలూరు జిల్లా వీరికి సంబంధించిన ఇండియన్ పాస్ పోర్ట్ నెం. K3758353 జిరాక్స్ నిమిత్తం సెంటర్‌కు వెళ్లి, ఏపూరు ఇంటికి వెళ్ళుచుండగా మార్గం మధ్యలో పోయినది దొరికిన వారు క్రింది నెంబర్‌ను సంప్రదించి అందజేయగలరు.
✆ 7671014334

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
దెందులూరు, ఉంగుటూరు
✆ 90102 23729
✆ 79955 66352
Office mail : tpgadvt@gmail.com